నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, మంగళవారం 22 అక్టోబర్ 2024 | HANUMAKONDA



వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద

# అమరుల యాదిలో..

## ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకలు
- నివాళులర్పించిన పోలీసు బాస్‌లు
- రక్తదాన శిబిరాలు.. కొవ్వొత్తులతో ర్యాలీలు



రఘునాథపల్లి : నివాళులర్పిస్తున్న జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, పక్కన డీసీపీ రాజమహేంద్రనాయక్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా జరిగింది. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీ అంబర్ కిశోర్ ఝా, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారద, ఇతర పోలీసు అధికారులు, అమరవీరు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలోని అమరవీరుల స్తూపం వద్ద కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, ఓఎస్డీ బోనాల కిషన్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తదితరులు నివాళులర్పించారు. జనగామ జిల్లా రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తదితరులు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. ములుగు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ డాక్టర్ పీ శబరీష్, అదనపు ఎస్పీ సదానందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.



భూపాలపల్లి రూరల్ : అమరవీరుల కుటుంబాలకు గిఫ్ట్‌లు అందజేస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే



ములుగు రూరల్ : అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ శబరీష్, అదనపు ఎస్పీ సదానందం

# దంచికొట్టిన వాన



హనుమకొండ బస్టాండ్‌లో నిలిచిన వర్షపునీరు

వరంగల్/నర్సంపేట రూరల్/వాజేడు, అక్టోబర్ 21: వరంగల్ నగరంలో సోమవారం జోరు వాన కురిసింది. జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. నగర రోడ్లు వరద నీటితో నిండిపోయాయి. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. మోకాళ్ల లోతులో నీరు ప్రవహించింది. వరంగల్ చౌరస్తా, అండర్ బ్రిడ్జి ప్రాంతాలతో పాటు హనుమకొండ బస్ స్టేషన్, బాలసముద్రం, కాకాజీ కాలనీలు వరద నీటిలో మునిగిపోయాయి. పాఠశాలలు, కళాశాలలు వదిలిన సమయంలో ఒక్కసారిగా జోరుగా వర్షం పడడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. బ్యాగులు తడువకుండా పరుగులు పెట్టారు. స్కూళ్ల నుంచి పిల్లలను తీసుకువెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు అనుకోకుండా వచ్చిన వానతో ఇబ్బందులు పడ్డారు. నర్సంపేట మండలం మాదన్నపేట, నర్సింగాపురం, ఇటుకాలపల్లి, గురిజాల, ముగ్ధుంపురం, లక్నేపల్లి గ్రామాల్లో వరిపంట నేలవాలింది. ములుగు జిల్లా వాజేడు మండలంలో గాలిదుమారంతో భారీ వర్షం కురిసింది.

# తరగతి గదిలో పాము

- పరుగులు తీసిన విద్యార్థులు
- కట్ల పాముగా గుర్తించి, చంపేసిన పాఠశాల సిబ్బంది



తరగతి గదిలో సిబ్బంది చంపిన పాము

దంతాలపల్లి, అక్టోబర్ 21: ప్రభుత్వ పాఠశాల తరగతి గదిలోకి పాము వచ్చిన ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. కుమ్మరికుంట్ల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో సోమవారం ఉదయం 7వ తరగతి గదిలోకి విద్యార్థులు వెళ్లే సరికి గోడపై పాము కనిపించింది. దీంతో విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. గమనించిన ఉపాధ్యాయులు, సిబ్బంది విషపూరితమైన కట్ల పాముగా గుర్తించి చంపడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం, చుట్టూ వ్యవసాయ భూములు ఉండడంతో తరచూ పాములు, తేళ్లు వస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు.



మేడిపల్లి వద్ద పట్టుబడిన వాలుగ

# వన్యప్రాణులకు రక్షణ కరువు

## వేటగాళ్ల వలలో చిక్కుకొని అడవి జంతువుల విలవిల..

- ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో జోరుగా వేట
- ఉచ్చులు, విద్యుత్ వైర్లను వినియోగిస్తున్న వైనం
- గుట్టుచప్పుడు కాకుండా చర్మం, మాంసం విక్రయాలు
- సమాచారం ఇస్తేనే పట్టుకుంటున్న అధికారులు

ములుగు/జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ)/బయ్యారం: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వన్యప్రాణులకు రక్షణ కరువైంది. ఫలితంగా రోజురోజుకూ అవి కనుమరుగవుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా ఏజెన్సీ గ్రామాల్లో వేటగాళ్లు ఉచ్చులు, విద్యుత్ తీగలు అమర్చి అడవి జంతువులను వధిస్తున్నారు. అనంతరం గుట్టుచప్పుడు కాకుండా వాటి చర్మం, మాంసాన్ని పట్టణ ప్రాంతాలు, శివారుల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎవరైనా సమాచారం ఇస్తేనే పట్టుకుంటున్నారని, మరికొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వన్యప్రాణుల సంరక్షణకు కఠిన చట్టాలున్నా అవి అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలున్నాయి.

**ములుగు జిల్లాలో..**

ములుగు మండలంలోని జాకారంలో ఈ నెల 8న అడవి పందితో పాటు మనుపిల్లిని విద్యుత్ తీగలు అమర్చి చంపి కాల్చిన సంఘటన చోటుచేసుకున్నది. సెప్టెంబర్ 18న వెంకటాపూర్ మండలం వెల్తుర్లపల్లి వద్ద మూడు అడవి పందులను విద్యుత్ తీగలు అమర్చి హతమార్చి కాల్చిన ఘటనతో పాటు ఈ నెల 5న గోవిందరావుపేట మండలం మచ్చాపూర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి అమర్చిన ఉచ్చులో అడవిపంది పడి తప్పించుకున్నది. దీంతో పాటు ఆగస్టులో భారీ వర్షాల వల్ల వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం పాకాల అటవీ మార్గం గుండా ములుగు మండలం మదనపల్లి శివారులోని లోకం చెరువు వరకు పంట పొలాల్లో చిరుతపులి అడుగులను ఫారెస్టు అధికారులు గుర్తించారు. అయితే ఈ చిరుతపులి తిరిగి దాని స్థావరానికి వెళ్లింది. ములుగు జిల్లాలో వన్యప్రాణుల వేటతో పాటు ఇతర రాష్ట్రాల మీదుగా అటవీ జంతువుల మాంసం, చర్మం రవాణా సాగుతున్నది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 25న ఛత్తీస్‌గఢ్ నుంచి రాష్ట్రంలో విక్రయించేందుకు ఓ వ్యక్తి బైక్‌పై చిరుతపులి చర్మాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసు, అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. గతంలో సైతం జిల్లాకు వచ్చిన పెద్దపులిని వేటాడి చంపి దాని చర్మం, గోర్లు, మీసాలను విక్రయించేందుకు యత్నించిన వారిని పోలీసులు పట్టుకున్నారు. అధికారులు స్పందించి వన్యప్రాణుల సంరక్షణ చర్యలు చేపట్టాలని వన్యప్రాణి ప్రేమికులు కోరుతున్నారు.



పట్టుకున్న చిరుతపులి చర్మాన్ని చూపిస్తున్న ఏటూరునాగారం ఏఎస్పీ, అటవీ అధికారులు (ఫైల్)

### మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో..

మహబూబాబాద్ జిల్లా బయ్యారం ఏజెన్సీలోని అనేక గ్రామాలు అడవిని ఆనుకొని ఉండడంతో వేటగాళ్ల ఉచ్చులో పడి వన్యప్రాణులు విలవిల్లాడుతున్నాయి. పంటల కోసం అవి వస్తుండడంతో వేటగాళ్లు ఉచ్చులు, విద్యుత్ తీగలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కొండగొర్రె, అడవి పందులు, దుప్పులు, కుందేళ్లు, కొండముచ్చులు వంటి అడవి జంతువులు మృత్యువాత పడడంతో గుట్టుచప్పుడు కాకుండా మాంసాన్ని మైదాన ప్రాంతాల్లోని రహస్య ప్రదేశాలకు తీసుకొచ్చి కిలో రూ. 500 నుంచి రూ. వేయి వరకు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా బయ్యారం మండలంలోని నామాలపాడు, మొట్లతిమ్మాపురం, పందిపాడు, బీరోనిమడవ, కారుకొండ, వినోభానగర్, టేకులగూడెం, కాచనపల్లి, సాంబతండా, చింతోనిగుంపు, రామచంద్రాపురం, కొత్తతండా, మిర్యాలపెంట గ్రామాల్లో వేట జోరుగా సాగుతున్నట్లు తెలుస్తున్నది. ఇటీవల వారం రోజుల వ్యవధిలోనే అడవి పందిని వధించిన చింతోనిగుంపు, బాలాజీపేట గ్రామాలకు చెందిన నలుగురిపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. గతంలో వినోభానగర్ అడవుల్లో వన్యప్రాణుల కోసం నాటు బాంబులు ఏర్పాటు చేయగా వాటిని తిన్న కుక్క సైతం మృతి చెందింది. అడవుల పరిరక్షణలో కీలకపాత్ర పోషించే అటవీశాఖ సిబ్బంది వన్యప్రాణాల సంరక్షణలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అడవుల పరిరక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. నీటితొట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. దీంతో ఎన్నడూ లేని విధంగా వన్యప్రాణుల సంతతి వృద్ధి చెందింది. అయితే నేడు అందుకు తగినట్లుగా అటవీశాఖ వేటగాళ్లపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది అటవీ సిబ్బంది వేటగాళ్లకు సహకరిస్తూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తున్నది.



బయ్యారం: స్వాధీనం చేసుకున్న అడవి జంతువు మాంసం (ఫైల్)

### ప్రత్యేక నిఘా పెట్టాం..

వన్య ప్రాణులకు ముప్పు వాటిల్లకుండా వేటగాళ్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాం. వన్య ప్రాణుల సంరక్షణపై గిరిజన గ్రామాల్లోని ప్రజలకు అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన కూడా కల్పిస్తున్నాం. చింతోనిగుంపు, బాలాజీపేట గ్రామాల్లో ఇటీవల అడవి పందిని చంపిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేశాం. 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం అడవి జంతువులను వేటాడడం నేరం. వేటాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– సువత్సలారెడ్డి ఎఫ్‌ఆర్వో, బయ్యారం

### జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని సరిహద్దు అటవీప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకొని వణ్యప్రాణులు ప్రాణాలు కోల్పోతున్నాయి. మహాదేవ్‌పూర్ మండలం సూరారం గ్రామంలో మార్చి 3న వణ్యప్రాణి మాంసాన్ని అటవీశాఖ అధికారి కమల పట్టుకున్నారు. మాదోట సురేశ్ దుప్పి మాంసాన్ని అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ నెల 4న జిల్లాలోని కాటారం మండలం మేడిపల్లి వద్ద వాలుగను స్మగ్లింగ్ చేసే ముఠాను చెన్నైకి చెందిన వైల్డ్ లైఫ్ బ్యూరో అధికారులు పట్టుకుని ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. జిల్లా సరిహద్దులో పంటలను కాపాడుకోవడానికి కొందరు, అడవి జంతువులను వేటాడడానికి మరికొందరు ఉచ్చులు ఏర్పాటు చేస్తున్నారు. దుప్పులు, ఇతర అడవి జంతువులు బలవుతుండగా వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేఖ, పక్కన కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే నాగరాజు

# ఎనుమాముల మార్కెట్‌లో పత్తి కొనుగోలు కేంద్రం

- ఏర్పాటు చేసిన సీసీఐ.. ప్రారంభించిన మంత్రి సురేఖ

కాశీబుగ్గ, అక్టోబర్ 21 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మంత్రి సురేఖ వరంగల్ కలెక్టర్ సత్యశారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి రైతులకు గిట్టుబాటు ధర అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చి గరిష్ఠ ధర పొందాలని సూచించారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తేమను దృష్టిలో పెట్టుకొని పత్తికి ధర నిర్ణయిస్తారని అన్నారు. సీసీఐకి అమ్మే రైతులు తప్పనిసరిగా బ్యాంక్ పాస్ బుక్, ఆధార్‌కార్డు తీసుకొని రావాలని, వారికి మూడు రోజుల్లో డబ్బులు అకౌంట్‌లో పడతాయన్నారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 27 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి మొదటి విడతలో వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో 14 ప్రారంభించినట్లు తెలిపారు. మిగతా కేంద్రాలను నర్సంపేటలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో జేడీఎం ఉప్పుల శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంవో సురేఖ, కార్యదర్శి పోలెపాక నిర్మల, కార్పొరేటర్ తూర్పాటి సులోచన, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీసీఐ జనరల్ మేనేజర్ అర్జున్‌దుబే, కృష్ణారెడ్డి, చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పట్టాలపై విచారణ

- 'నమస్తే' కథనంతో ఆదేశించిన కలెక్టర్
- రుణాలు పొందిన వారి వివరాలు సేకరిస్తున్న అధికారులు
- అటవీ హక్కు పట్టాల జారీలో కలెక్టరేట్‌లోని ఓ వ్యక్తి ప్రమేయం?
- కాసిందేవిపేట కేంద్రంగా సాగుతున్న దందా



ములుగు ఏపీజీవీబీ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్వో శంకర్, ఫారెస్టు అధికారులు

ములుగు, అక్టోబర్21(నమస్తే తెలంగాణ) : నకిలీ పట్టాలపై ములుగు కలెక్టర్ విచారణకు ఆదేశించారు. సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'అటవీ భూములకు నకిలీ పట్టాలు' కథనానికి స్పందించారు. దీంతో ములుగు ఎఫ్‌ఆర్వో జిల్లా కేంద్రంలోని అన్ని బ్యాంకులను తనిఖీ చేసి ఇటీవల నకిలీ పట్టాలతో రుణాలు పొందిన వారి పాసు పుస్తకాలను, వివరాలను సేకరించగా, విస్తుపోయే మరిన్ని నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఐఏఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారుల సంతకాలతో పాటు బ్యాంకు రుణాలను మంజూరు చేసే క్రమంలో ములుగు ఎఫ్‌ఆర్వో సంతకాన్ని సైతం ఫోర్జరీ చేసి ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసినట్లు తేలింది. మరో రెండు రోజుల్లో దందాకు తెరలేపిన వ్యక్తులు, అందుకు సహకరించిన వారి వివరాలను అటవీ శాఖ అధికారులు వెల్లడించే అవకాశాలున్నాయి.

**150 మంది నుంచి డబ్బుల వసూళ్లు**

ములుగు మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో 100 నుంచి 150 మంది గిరిజనేతరుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ. 40వేల చొప్పున వసూలు చేసి నాలుగు ఎకరాలకు పైబడి భూమిని నమోదు చేస్తూ నకిలీ అటవీ హక్కు పట్టాలను అందిస్తున్నారు. భూమి ఎక్కడ ఉందనేది తెలియకున్నా పాసు పుస్తకాలు అందిస్తున్నారు. గతంలో ములుగు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన కృష్ణ ఆదిత్య, ఏటూరునాగారం ఐటీడీఏ పీవోగా పనిచేసిన అంకిత్, డీఎఫ్‌వోగా పనిచేసిన కృష్ణగౌడ్ సంతకాలను పొందుపర్చి పుస్తకాలను జారీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఎంబ్లమ్‌ను కూడా నకిలీది తయారు చేసి గుర్తు పట్టలేకుండా అతికిస్తున్నారు. ములుగు కలెక్టరేట్‌లో పని చేసే ఓ ఉద్యోగితో పాటు ఓ రిటైర్డ్ ఫారెస్టు అధికారి, ప్రైవేట్ నెట్ సెంటర్ వ్యక్తితో పాటు మరికొంత మంది ముఠాగా ఏర్పడి గిరిజనేతరుల వద్ద అందిన కాడికి దోచుకుంటున్నారు. పట్టా వచ్చిన అనంతరం బ్యాంకుల ద్వారా క్రాప్‌లోన్ తీసుకుంటే తిరిగి రూ.5వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ములుగు మండలం కాసిందేవిపేట గ్రామ కేంద్రంగా ఈ దందా కొనసాగుతున్నది. గ్రామంలో చికెన్ సెంటర్ నడిపే ఓ వ్యక్తి గిరిజనేతరుల నుంచి డబ్బులు తీసు కొని మరొకరికి అందిస్తున్నాడు. నకిలీ పట్టాలు పొందిన వారు జిల్లా కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌ను మధ్యవర్తుల ద్వారా సంప్రదించి నాలుగు ఎకరాలకు రూ. లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకు రుణాలను పొందుతున్నారు. ఇతర బ్యాంకు అధికారులు నిరాకరించినా, ఏజీవీబీ మేనేజర్‌తో పాటు ఫీల్డ్ ఆఫీసర్ ముడుపులు తీసుకొని రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తున్నది. కాగా, విషయం బయటకు రావడంతో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారులు సోమవారం కాసిందేవిపేట, రామయ్యపల్లి గ్రామాల్లో పర్యటించి రుణాలను పొందిన గిరిజనేతరుల వద్దకు వెళ్లి రుణాలు కట్టాలని ప్రాధేయ పడినట్లు తెలిసింది.

# రిజర్వాయర్ ప్రతిపాదన వద్దు..

### కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా



వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రంగాయ చెరువు నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటీ బాధ్యులు, స్థానిక రైతులు

ఖిలావరంగల్, అక్టోబర్ 21 : వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గోవిందాపూర్ శివారులోని రంగాయ, ఎర్రాయ చెరువులను కలిపి రిజర్వాయర్ చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కోరుతూ రంగాయ చెరువు రిజర్వాయర్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. రిజర్వాయర్ చేయడం వల్ల 8 గ్రామాల ప్రజలు నిర్వాసితులవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిటీ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు గూబ రాజు, గంగుల దయాకర్, రాచర్ల బాలరాజు, పైడి మాట్లాడుతూ గతంలోనే రిజర్వాయర్‌ను ప్రజలు వ్యతిరేకించారని, ఇటీవల జరిగిన దేవాదుల ప్రాజెక్టు సమీక్షా సమావేశంలో మళ్లీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రంగాయ చెరువును రిజర్వాయర్ చేయాలనే ప్రతిపాదన చేశారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో పరికి రత్నం, లావుడియా తిరుపతి, తడక కోమల, ప్రతాప్, బాలు, సదయ్య, సాంబయ్య, రమేశ్, పుష్పమ్మ, మమత, అంబాలి పాల్గొన్నారు.

# ప్రొటోకాల్ ఉల్లంఘించిన కాంగ్రెస్ నేత

- ఏఎంసీ ప్రమాణ స్వీకారంలో డీసీసీ అధ్యక్షుడు
- యార్డులో హస్తం పార్టీ మీటింగ్.. ఇబ్బందులు పడిన రైతాంగం



జనగామ మార్కెట్ పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ చౌరస్తా, అక్టోబర్ 21: జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మరోసారి ప్రొటోకాల్ ఉల్లంఘించారు. అధికారిక కార్యక్రమంలో పాల్గొని తానేం ప్రజాప్రతినిధికి తక్కువ కాదన్నట్టు వ్యవహరించారు. సోమవారం మార్కెట్ కార్యాలయంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ముఖ్య అతిథిగా వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు మెంబర్లతో జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మాత్రమే పాల్గొనాల్సి ఉండగా, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దర్జాగా ఆసీనుడయ్యాడు.

**మార్కెట్ యార్డులో కాంగ్రెస్ మీటింగ్**

జనగామ మార్కెట్ యార్డులో ధాన్యం రాశులు నిల్వ చేసే చోట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మీటింగ్ నిర్వహించగా రైతులు ఇబ్బందులు పడ్డారు. వారు చేసేదేమీ లేక తమ ధాన్యాన్ని కింద నేలపై పోసుకున్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు వారి మీటింగ్‌ను వేరే దగ్గర నిర్వహిస్తే బాగుండేదని, కనీసం మార్కెట్ అధికారులైనా దీనిపై ముందస్తు సమాచారం ఇస్తే మార్కెట్‌కు ధాన్యం తెచ్చేవారం కాదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

### ఇబ్బందిపడ్డాం



మార్కెట్ యార్డులో కాంగ్రెస్ నాయకులు మీటింగ్ పెట్టడంతో ధాన్యం అమ్ముకుందామని వచ్చిన రైతులమంతా ఇబ్బందిపడ్డాం. గత్యంతరం లేక నేలపై కవర్లు పర్చి తీసుకొచ్చిన రెండు ట్రాక్టర్ల ధాన్యాన్ని కుప్పలుగా పోసినం. ఈ సమయంల వానగిట్ల పడితే మా పరిస్థితి ఏందనేది అర్థమైతలేదు. ధాన్యం కుప్పలు పోసుకోకుండా ఎందుకని ఇక్కన్నే మీటింగ్ పెట్టుకుండ్లో వాళ్లకే తెల్వాలి. బయట ఎక్కడన్న పెట్టుకుంటే ఎవరికి ఇబ్బంది ఉండేది కాదు. ఇక్కడ మీటింగ్ అని మార్కెటోళ్లు ముందుగా చెప్పినా వచ్చే వాళ్లం కాదు.

– సానికె మహేశ్, రైతు, నాగారం గ్రామం, లింగాల ఘనపురం, జనగామ